నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 9 జూన్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

అయ్యప్ప ధర్మప్రచార సభ జిల్లా కార్యవర్గ సమావేశం

ఎన్నికైన సభ్యులుతో ఏబీఏసీ నాయకులు

మంచిర్యాల అర్బన్, జూన్ 8 : మంచిర్యాల లోని కార్తికేయన్ హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చుంచు రాజ్ కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి జాతీయ ప్రధాన కార్యదర్శి బేతి తిరుమల్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మట్టపల్లి సంపత్‌రావు, సహాయ కార్యదర్శి భూతం రాజేశం హాజరై 2025-26 సంవత్సరంలో చేపట్టబోయే అయ్యప్ప స్వాముల సేవా కార్యకమాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంచిర్యాల పట్టణ అధ్యక్షుడిగా మల్లికార్జున్‌ను నియమించగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎలుక సంతోష్‌ను, ట్రెజరర్‌గా బొడ్డు లచ్చన్నను ఎన్నుకున్నారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు కొండ శ్రీనివాస్, సభ్యులు శివారెడ్డి, రఘుపతిరావు, వేముల రాము, బేతి సత్యం, రాజేశం, రాష్ట్ర పీఆర్వో బాస్కర్ల రాజేశం, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తా

కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 8 : నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రూ.2.30 కోట్లతో పీవీటీజీ హాస్టల్ నిర్మిస్తుండగా, ఆమె ఆదివారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, ప్రధానోపాధ్యాయుడు సుభాష్, ఏఈ కిరణ్ కుమార్, శశిధర్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



పీఎస్సార్‌కు మొండిచేయి

మంత్రివర్గంలో దక్కని చోటు



- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌ను వరించిన మంత్రి పదవి
- అలక బూనిన ప్రేమ్‌సాగర్‌రావు
- బుజ్జగించేందుకు రంగంలోకి పార్టీ పెద్దలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో గందరగోళం
- రెండుగా చీలిపోనున్న కేడర్
- ఆసక్తిగా మారిన 'హస్తం' రాజకీయాలు

మంచిర్యాల, జూన్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంత్రివర్గ విస్తరణ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో గందరగోళానికి తెరలేపింది. ఆది నుంచి పార్టీని అంటిపెట్టుకొని ఉన్న సీనియర్ నాయకుడు ప్రేమ్‌సాగర్‌రావును కాదని, ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చిన చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వడంపై పీఎస్సార్ వర్గం భగ్గుమంటున్నది. వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వడంతో ఉమ్మడి జిల్లాలో హస్తం పార్టీ కేడర్ రెండు వర్గాలుగా చీలిపోవడం ఖాయంగా కనిపిస్తున్నది. నిన్న మొన్నటి వరకూ అంతర్గతంగా సాగిన వివాదాలు ఇకపై ఎటుపోయి ఎటు తిరుగుతాయోనన్న పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్‌కు మంత్రి పదవి వస్తుందనే ప్రచారం జోరుగా సాగింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, సీనియర్ నాయకులు సైతం పీఎస్సార్‌కు పదవి పక్కా అనే చెప్పుకొచ్చారు. అధిష్ఠానం ముందు సైతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఆయననే రెఫర్ చేస్తూ వచ్చినట్లు తెలిసింది. కానీ, చెన్నూర్ ఎమ్మెల్యేగా గెలిచిన వివేక్ వెంకటస్వామి అనుహ్యంగా రేసులోకి వచ్చారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సపోర్టు దొరకడంతో మంత్రి పదవి కోసం పట్టుబిగించారు. ఇలా ఇద్దరు ఎమ్మెల్యేలు ఎవరికి వారు మంత్రి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలోనే ఒకరిపై మరొకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకున్నారు. తాజాగా.. మంత్రివర్గ విస్తరణలో అధిష్ఠానం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వైపునకు మొగ్గు చూపడం చర్చనీయాంశంగా మారింది. పీఎస్సార్ వర్గం నాయకులు అధిష్ఠానం తీసుకున్న నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తీవ్ర అంసతృప్తిలో పీఎస్సార్

మంత్రి పదవి దక్కకపోవడంపై మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్ తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. అలకబూనిన ఆయన రాజ్‌భవన్‌లో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సైతం దూరంగా ఉన్నారు. దీంతో ఆయనను బుజ్జగించేందుకు ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ హైదరాబాద్‌లోని పీఎస్సార్ నివాసానికి వెళ్లారు. ''కష్టకాలంలో ఆదిలాబాద్ జిల్లాలో పార్టీని, కార్యకర్తలను కాపాడుకున్నా. పార్టీ పరంగా నాకు అన్యాయం జరిగింది. అన్ని పార్టీలు మారి వచ్చిన వారికి మంత్రి పదవి ఇచ్చి కేడర్‌కు తప్పుడు సంకేతాలు ఇచ్చారు. రేవంత్‌రెడ్డి పీసీసీ హోదాలో ఉన్నప్పుడు ఇంద్రవెల్లిలో దళిత, గిరిజన దండోరా బహిరంగ సభ నిర్వహించి సక్సెస్ చేశాను. భట్టి విక్రమార్క పాదయాత్రను సక్సెక్ చేసి, లక్ష మందితో మంచిర్యాల సభను నిర్వహించాను. నాలా సిన్సియర్‌గా పని చేసిన నాయకుడికి న్యాయం చేస్తే కార్యకర్తలకు అది ఇన్పిరేషన్‌గా ఉండేది. పార్టీ కోసం ఎంతో కష్టపడ్డా. పార్టీ నాకు తీవ్ర అన్యాయం చేసింది' అంటూ పార్టీ పెద్దల ముందే ఆయన అసంతృప్తి వెల్లగక్కినట్లు సమాచారం. మంత్రి పదవి కాకుండా మరో కీలక పదవి ఆఫర్ చేయగా.. నాకు ఎలాంటి పదవులు వద్దు. కార్యకర్తగానే ఉంటా.. పార్టీని విడిచిపోను'' అని ఆయన చెప్పినట్లు తెలిసింది. పీఎస్సార్ సన్నిహితులు మాత్రం అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. మా సార్‌కు అన్యాయం చేశారంటూ వాపోతున్నారు. సార్ ఆదేశిస్తే ఏమైనా చేసేందుకు సిద్ధమని స్పష్టం చేస్తున్నారు.

కుటుంబ రాజకీయాలకే కాంగ్రెస్ ప్రాధాన్యం..

చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వడం వెనుక సామాజిక సమీకరణలు, కారణాలు ఏమున్నా.. కుటుంబ రాజకీయాలను పార్టీ ప్రోత్సహిస్తుందనే ముద్ర పడిపోయింది. గతంలో ప్రేమ్‌సాగర్‌రావు సైతం ఇదే విషయాన్ని ప్రస్తావించారు. గడ్డం వివేక్, గడ్డం వినోద్‌లకు ఇద్దరికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారు. వారి కుమారుడు వంశీకృష్ణకి ఎంపీ టికెట్ ఇచ్చారు. ఇప్పుడు వారి కుటుంబానికే మంత్రి పదవి ఇస్తే.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీల గొంతుకగా ఉన్న నా గొంతు కోసినట్లే అంటూ చెప్పారు. మొన్నటికి మొన్న గడ్డం వివేక్ అండ్ ఫ్యామిలీ కాంగ్రెస్‌లో చీలికలు తెస్తున్నారంటూ, ప్రత్యేక వర్గాన్ని రెడీ చేసుకుంటున్నారంటూ పలుచోట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులే బహిరంగ విమర్శలకు దిగారు. సొంత నియోజకవర్గ నాయకులే మా ఎమ్మెల్యే బీజేపీలోకి పోతాడా.. బీఆర్ఎస్‌లోకి పోతాడా అనే అనుమానాలున్నాయంటూ మాట్లాడుకొచ్చారు. కానీ ఇవేవీ కాంగ్రెస్ అధిష్ఠానం లెక్కలోకి తీసుకున్నట్లు లేదు. పార్టీ కోసం ముందు నుంచి కష్టపడిన నాయకుడికి కాదని, పార్టీలో గ్రూప్ రాజకీయాలను ప్రోత్సహించే వ్యక్తులకు పదవులు ఇవ్వడంపై మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కేడర్ అసహనం వ్యక్తం చేస్తున్నది. కుటుంబ రాజకీయాలను సహించం, కష్టపడిన వారికే పదవులు ఇస్తామంటూ చెప్పిన నీతి వ్యాఖ్యలను అధిష్ఠానం విస్మరించిదంటూ అసంతృప్తి వెల్లగక్కుతున్నారు.

మరో విస్తరణలోనూ పీఎస్సార్‌కు కష్టమే..

తాజా మంత్రివర్గ విస్తరణలో ముగ్గురికి అవకాశం కల్పించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి వివేక్‌కు చోట దక్కింది. సామాజికవర్గ సమీకరణలో భాగంగా ఆయనకు పదవి ఇచ్చినట్లు చెబుతున్నారు. కాగా, మంత్రివర్గంలో మరో ముగ్గురిని చేర్చుకునే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యాక మరోసారి మంత్రివర్గ విస్తరణ ఉంటుందని సమాచారం. అందులో పీఎస్సార్‌కు చోటు ఉంటుందని ఆయన అనుచరులు, కార్యకర్తలు ఇప్పటికీ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ సైతం ఇదే హామీ ఇచ్చారని చెప్పుకుంటున్నారు. కానీ వాస్తవ పరిస్థితి మరోలా ఉంది. జిల్లాల వారీగా చూసుకుంటే రంగారెడ్డి, నిజామాబాద్, హైదరాబాద్ జిల్లాల నుంచి ఇప్పటి వరకు మంత్రి వర్గంలో ఎవరికి చోటు ఇవ్వలేదు. జిల్లా సమీకరణలో మిగిలిన మూడు మంత్రి పదవులను ఇలా భర్తీ చేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. అదే జరిగితే ఆదిలాబాద్ జిల్లా నుంచి వివేక్ మంత్రిగా ఉన్నందున.. పీఎస్సార్‌కు ఇక మంత్రి పదవి రావడం కష్టమే అనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. సామాజికి సమీకరణలు తీసుకున్నా పీఎస్సార్‌కు మంత్రి పదవి వచ్చే అవకాశాలు లేవనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. ఒకవేళ ఆయన పట్టుబడితే ఎలాంటి సమీకరణలు చేయకుండా మంత్రి పదవి ఇచ్చే అవకాశం లేకపోలేదు. పీఎస్సార్ ఏం చేయబోతున్నారు.. భవిష్యత్తు కార్యచరణ ఏమైనా ప్రకటిస్తారా.. లేకపోతే మిన్నకుండిపోతారా... ఆయన విషయంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది.. అన్నది ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

నవోదయం.. భవితవ్యం

- ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- జూలై 29తో ముగియనున్న గడువు
- డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష

కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయం

నస్పూర్, జూన్ 6 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయం గ్రామీణప్రాంత విద్యార్థులకు వరంగా మారుతున్నది. 2026-27 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ ఒకటో తేదీ నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ మొదలైంది. జూలై 29తో గడువు ముగియనున్నది. డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న వారు దరఖాస్తులు చేసుకునే అవకాశముండగా, 1-4-2014 నుంచి 31-7-2016 మధ్యన జన్మించిన వారై ఉండాలి.

తప్పగా నమోదు చేస్తే తిప్పలే..

జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశ పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేటప్పుడు కొందరు తప్పులు చేయడం వల్ల సీటు సాధించినప్పటికీ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే సమయంలో అర్బన్, రూరల్ ఆప్షన్‌లను గుర్తించి ఏ ప్రాంతానికి చెందిన వారైతే ఆ ఆప్షన్ ఎంచుకోవాలి. ఉమ్మడి జిల్లాలో 14బ్లాకులు ఏర్పాటు చే శారు. తమ మండలం ఏ బ్లాక్ పరిధిలోకి వ స్తుందో అది గుర్తించి ఎంచుకోవాలి. ఆన్‌లైన్ ఆప్షన్‌లు తప్పుగా ఎంచుకోవడంతో సీటు సాధించినప్పటికీ తిప్పలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

ప్రజల మనిషి మునీర్

- టీయూడబ్ల్యూజే హెచ్-143 రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- మంచిర్యాలలో జర్నలిస్టు మునీర్ సంస్మరణ సభ

మునీర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అల్లం నారాయణ, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, జర్నలిస్టులు

మంచిర్యాలటౌన్, జూన్ 8 : ఉద్యమకారుడిగా, జర్నలిస్టుగా పనిచేసిన ఎండీ మునీర్ ఇక్కడి ప్రజల మనిషిగా పేరు తెచ్చుకున్నారని టీయూడబ్ల్యూజే హెచ్-143 రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. టీయూడబ్ల్యూజే హెచ్-143 మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాలలో మునీర్ సంస్మరణ సభ నిర్వహించారు. అల్లంనారాయణ, దివాకర్‌రావుతో పాటు నాయకులు, జర్నలిస్టులు మునీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మునీర్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తుకు చేసుకున్నారు. అల్లం నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టుగా పనిచేస్తూనే తెలంగాణ ఉద్యమంలో మునీర్ చురుకుగా పాల్గొన్నారన్నారు. మాజీఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ మునీర్‌తో తనకు చాలా ఏళ్ల అనుబంధం ఉన్నదని, అనేక విషయాలను తాను అతనితో చర్చించేవాడినన్నారు. టీబీజీకేఎస్ నాయకులు రామ్మూర్తి మాట్లాడుతూ మునీర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేస్తామని, సింగరేణి ఏరియాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు మునీర్ పేరిట ఉత్తమ జర్నలిస్టు అవార్డులు ఇచ్చేందుకు కృషిచేస్తామని, మునీర్ చరిత్రను పుస్తక రూపంలో తీసుకువస్తామని నిర్ణయం తీసుకున్నామన్నారు. మునీర్ సోదరుడు సందాని మాట్లాడుతూ చిన్నతనం నుంచి మునీర్ ఉద్యమాల్లో ఎలా పాల్గొనేవారో, ఎందుకు ఉద్యమ పంథాలో నడవాల్సి వచ్చిందో వివరించారు. ఇప్పూ జాతీయ నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ పలు ఉద్యమాల్లో మునీర్‌తో కలిసి తాము పనిచేశామని, ఉద్యమ భావాలు కలిగిన వ్యక్తి కాబట్టే అతనంటే తమకు ఎంతో ఇష్టం ఉండేదన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే హె-143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీసాగర్, కోశాధికారి యోగానంద్, జిల్లా కన్వీనర్ దాసరి ఉమేశ్, కో కన్వీనర్లు చెట్ల రమేశ్, రేణికుంట్ల శ్రీనివాస్, ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్ రవినాయక్, సీపీఐ ఎంఎల్ నాయకులు లాల్‌కుమార్, పీవోడబ్ల్యూ నాయకురాలు మంగ, రచయిత, కవి సుందిళ్ల రాజన్న, మునీర్ కుమారుడు మయూర్, మిత్రులు యాదిరెడ్డి, అబ్బాస్, సదాశివరెడ్డి పాల్గొన్నారు.

మునీర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

మందమర్రి, జూన్ 8 : ఇటీవల మరణించిన సీనియర్ జర్నలిస్టు మునీర్ విగ్రహాన్ని సింగరేణి ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆధ్వర్యంలో రెవల్యూషన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు యూనియన్ అధ్యక్షుడు అల్లం నారాయణకు వినతి పత్రం అందించారు. మంచిర్యాలలో ని ర్వహించిన సంస్మరణ సభలో కలిసి విన్నవించారు. సంస్థ ఉపాధ్యక్షుడు అక్బర్, మర్రి దీపక్, నోముల కృష్ణ, వెంకటేశ్, శ్రీనాథ్, జాఫర్ పాల్గొన్నారు.

నాడు : గొల్లపల్లిలోని తెలంగాణ క్రీడా ప్రాంగణం

నేడు : క్రీడా ప్రాంగణంలో దున్నిన కబ్జాదారులు

క్రీడా ప్రాంగణాన్నే దున్నేశారు

నెన్నెల, జూన్ 8 : కేసీఆర్ సర్కారు ఊరూరా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి గ్రామీణ యువతను ప్రోత్సహించగా, ప్రస్తుత ప్రభుత్వ పట్టింపు లేనితనంతో అవి కనుమరుగవుతున్నాయి. గతంలో నెన్నెల మండ లం గొల్లపల్లికి కిలోమీటరు దూరంలో ప్రాణహిత-చేవెళ్ల కోసం భూమి సేకరించగా, ఆ ప్రాజెక్టు అర్ధాంతరంగా నిలిచిపోయిం ది. అప్పట్లో ఇట్టి భూమికి సంబంధించి రైతులకు పరిహారం కూడా అందింది. ఆపై బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వ చ్చాక ఆ భూమిలో నుంచి మూడెకరాలను క్రీడా మైదానానికి కేటాయించి అభివృద్ధి చేసింది. ప్రస్తుతం ఆ క్రీడా మైదానంపై కొందరు కన్నేశారు. బోర్డు.. పెన్సింగ్ ఉండగానే ఆ భూమి తమదేనంటూ స్వాధీనం చేసుకొని పత్తి సాగు చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే క్రీడా ప్రాంగణం కబ్జాకు గురైందని, ఇకనైనా స్పందించి దానిని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్ఐ సులోచనను వివరణ కోరగా, ఆ భూమి ప్రభుత్వ ఆధీనంలోనే ఉందని, ఈ విషయాన్ని తహసీల్దార్ మహేంద్రనాథ్ దృష్టికి తీసుకెళ్లి విచారణ చేపడుతామన్నారు.

చేపలే.. చేపలు

మంచిర్యాల అర్బన్/సీసీసీ నస్పూర్/ చెన్నూర్/కౌటాల/నెన్నెల/తాండూర్/దహెగాం : మృగశిర కార్తె నేపథ్యంలో ఆదివారం చేపల విక్రయాలు జోరందుకున్నాయి. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాలతో పాటు సీసీసీ, నస్పూర్‌కాలనీ, సీసీసీ కార్న ర్, చెన్నూర్, తాండూర్, దహెగాం, కౌటాల తదితర చోట్ల అమ్మకాలు చేపట్టగా, కొనుగోలు దారులతో ఆయా ప్రాంతాలు సందడిగా కనిపించాయి. ఇక మార్కెట్‌లు సైతం రద్దీగా మారాయి. ఇక గోదావరితో పాటు ప్రాజెక్టులు, చెరువులు, వాగుల వద్ద చేపలు పట్టి అమ్మగా, కొందరు అక్కడికే చేరుకొని కొనుగోలు చేయడంతో ఆయా ప్రాంతాలు జాతరను తలపించాయి. కార్తె రోజున ఒక ముక్కైనా తినాలన్న ఉద్దేశంతో ప్రజలంతా కొనుగోళ్లకు ఎగబడ్డారు. ఇక చేపల రకాలను బట్టి కిలోకు రూ. 300 నుంచి రూ. 1000 దాకా ధర పలికినా వెనకాడలేదు.

మంచిర్యాల చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

చెన్నూర్ మార్కెట్‌లో చేపలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

నెన్నెలలో చేపల కోసం వచ్చిన యువకులు

కౌటాల : చేపలు కొంటున్న ప్రజలు